# కథ



**కృష్ణారావు నరసన్నపేట హైస్కూలుకు ఇరవై ఏ హెడ్‌మాస్టరు చేసి ఆ మధ్య రిటైర్ అయ్యాడు. అందరూ మాస్టారంటారు. మాస్టారు నీతికి, నిజాయితీకి, నిలకడకు, ఆదర్శాలకు, ఆత్మాభిమానానికి నిదర్శనం. ఈ ఇరవై ఏళ్ళల్లో స్వంతానికి చేసుకున్నది సున్న.**

తన ఆస్థి వైజాగ్‌లో ఓ చిన్న ఫ్లాట్, భార్య, ముగ్గురు పెళ్లి కాని అమ్మాయిలు. సర్వీసులో వున్నంతకాలం స్వార్థాన్ని చోటు చేసికోకుండా పరులకోసమే బ్రతికాడు. అంచేత ఆయన షష్టిపూర్తికి వేనకువేలు విద్యార్థులు ఎంతో పెద్ద పెద్ద ఉద్యోగాలు ప్రస్తుతం వెలిగిస్తూ, మాస్టారుకి పాదాభివందనం చేశారు. నరసన్నపేటకు వెలుగు వన్నెలు తెచ్చిన మొట్టమొదటి కార్యక్రమం ఆయన షష్టిపూర్తి అనే చెప్పాలి.

ఎన్నో గుణగణాలతో దశాబ్దాలు కీర్తిగడించిన మాస్టారుకు, రిటైర్ అయ్యాక, ఆయన గుణాలు, కీర్తి, ఆదర్శాలు అన్నీ భారంగా కనబడ్డాయి. రిటైర్మెంటు జీవితంలో కొత్తమలుపు, పిల్లలకు పెళ్ళిళ్ళు చెయ్యాలి. పెన్షన్ పేపర్సు సెటిల్ చేయించాలి. వైజాగ్‌లో ఇంటి ప్లానుకు ఆమోదం తెప్పించాలి. బ్యాంకు అప్పులు తెచ్చుకోవాలి. కాబోయే అల్లుళ్లకు వంగి నమస్కారాలు చెయ్యాలి. భార్య చెప్పినట్టు నడుచుకోవాలి. బంధువులకు ఉత్తరాలు వ్రాయాలి. భార్యకూ, తనకూ కొత్త కొత్త జబ్బులకు అనుమానాస్పదమైన నొప్పులకు డాక్టర్లను సంప్రదించాలి. చేసిన చిన్న చిన్న అప్పులను త్వరలో తీర్చాలి. ఇవి ఇప్పటి అవసరాలు. ఆత్మాభిమానులకు ఇవి కష్ట సాధ్యం.

ఈ మధ్య మునిసిపల్ ఆఫీసుకు ప్లాన్ గురించి వెళ్లాడు. ఆ ఆఫీసును చూసి చాలా బాధపడ్డాడు. పొద్దుటే పదింటికి వెళ్లి పన్నెండు వరకు అటూ ఇటూ తిరిగాడు. తెలిసినవాడు ఒక్కడూ కనపడలేదు. ఒక్క బంట్రోతు కూడా ఇతని వైపు మర్యాదగా, మంచిగాచూడలేదు. ఒక్క గుమాస్తా గూడ ఇతను తన పనిపైన ఎవరిని సంప్రదించాల్సిన విషయం చెప్పలేదు. అసలు ఆఫీసులో వుండవలసిన చోట, మనుషులే లేరు. ఒక్క మహానుభావుడు మాత్రం ఇతని వాలకం చూసి, విషయం తెలిసికొని, మీరు సాయంత్రం అయిదుకు వచ్చి "ఫలానా రూములో సంప్రతించండి" అని చెప్పాడు. అయిదింటికి ఎంతో ఉత్సాహంతో బయలుదేరాడు. అయిదింటికి ఈ ఆఫీసులోకి వెళ్లటం కంటే, చాపల మార్కెట్‌లోకి వెళ్ళటం సులువు. ఆఫీసు కారిడార్సులో మనుషులు, ఆఫీసులో మనుషులు, సిగరెట్ల పొగ, కిళ్లీల పొగ, కిళ్లీల కంపు, ఎంగిళ్ళు, చుట్టకంపు, భరించలేని విషాదం.

ఆఫీసులో అటూ ఇటూ తిరుగుతూంటే ఓ చోట 'ప్లానింగు ఆఫీసర్' అనే బోర్డు కనిపించింది. బయట ప్యూన్ ఎవరూ లేరు కాబట్టి ధైర్యం చేసి లోపలికి ప్రవేశించి, నమస్కారం సార్ అన్నాడు. "నేను రిటైర్డు హెడ్ మాస్టరుని" అన్నాడు. ఆ ఆఫీసర్ "ఇది ఎడ్యుకేషన్ డిపార్టుమెంటు కాదండీ" అన్నాడు. "తెలుసు. నేనొక బిల్డింగు ప్లాన్ సబ్మిట్ చేసుకున్నాను. నా మీద దయ వుంచి అది అప్రూవ్ చేయించగలరు"

"మీరు సబ్మిట్ చేసుకున్న వారి వద్దకే వెళ్లండి". అన్నారు వ్యంగ్యంగా. ఇతని సంవాదంలో ఉపయోగం లేదని బయటికి వచ్చేసాడు. ఆయన ప్లాన్ పేపర్సు ఎవరి ద్వారానో ఈ ఆఫీసుకు పంపాడు. ఇప్పుడు ఆ విషయంలో తల దూర్చేందుకు ఆయన చాలడని తెలిసి పోయింది.

కారిడార్‌లో ఎవరో ఆపి, 'మాస్టారూ ఆగండి' అన్నారు. 'ఓస్ సత్యనారాయణ, నీవటయ్యా, 'ఏమిటి ఇలా వచ్చావు"

వచ్చిన పని సెలవిచ్చాక సత్యనారాయణ మాస్టారిని ఒక సెక్షన్‌కి తీసుకెళ్ళి ఒకరికి పరిచయం చేశాడు. పద్ధతి ప్రకారం సమర్పయామి. పని బహు సులువు. వారంలో ప్లాన్ వచ్చేసింది.

అప్పటి నుంచి మునిసిపాలిటీ పనికి సత్యనారాయణను, ఆస్పత్రి పనికి అక్కాలు నాయుడినీ, ఆర్టీసి పనికి సుధాకర్‌నీ, కలెక్టరాఫీస్ పనికి రామిరెడ్డినీ కలవడం, చిన్న చిన్న లెవెల్స్‌లో తడపడం లాంటివి సంవత్సరం తిరక్కముందే జీవితంలో అవసరమైన పద్ధతులన్నింటినీ మాస్టర్ అమలు చేశాడు.

సినిమాలకు వెళ్ళి బ్లాకులో టిక్కెట్లు కొనడం కూడా అలవరచుకున్నాడు. వెనకటికి విద్యార్థులు కనిపిస్తే వాళ్లే తప్పుకునేవారు. కొందరు పారిపొయ్యేవారు. రిటైరయ్యాక వాళ్ళు నమస్కరిస్తే ఆయన చిరునవ్వు ప్రసాదించేవారు. ఇప్పుడు ఆయనే పలుకరించడం నేర్చేసుకున్నాడు.

వీటన్నిటికంటే, ఇటీవలి సంఘటన ఒకటి అతనిని చిత్తు చేసింది. అది డిసెంబరు. మద్రాసులో మాస్టారు తమ్ముడున్నాడు. తమ్ముడితో సంప్రదించాల్సిన విషయాలు చూసుకున్నాక కొన్ని రోజులక్కడే వుండదలిచాడు. ఇంతలో "పెద్ద కూతురికి సంబంధం వచ్చింది . "అర్జంటుగా వైజాగ్ రమ్మని" టెలిగ్రామ్ వచ్చింది.


ఆ రోజు ఆదివారం. వైజాగ్ వెళ్లేందుకు, మద్రాస్ సెంట్రల్‌లో కరెంటు బుకింగులో టికెట్ కొని వీలైనంత త్వరలో ఇల్లు చేరాలని, రైళ్ల టైమింగ్సును స్టడీ చేస్తే, విజయవాడ వరకు మద్రాస్ హైద్రాబాద్ రైల్లో వెళ్లితే, రాత్రి రెండింటికి విజయవాడలో హైద్రాబాదు నుంచి వైజాగ్ వెళ్లే గోదావరి దొరుకుతుంది.

సెంట్రల్‌లో సెకండు క్లాస్‌లో ఎక్కేందుకు ఇటు వైపు నుంచి అటువైపు వరకూ హైద్రాబాదు రైలుని నిశితంగా ఖాళీ కోసం పరీక్షించాడు. అన్నీ రిజర్వుడు కంపార్టుమెంట్సే. తప్పితేఒకటి రెండు ఫస్టు క్లాసు బోగీలు మరి ఖాళీగా వున్నాయి. ఒక బోగీ వద్దకు వెళ్ళి ఫస్టుక్లాసు అటెండరుకు ఒక ఇరవై సమర్పయామి చేసి లోపల కూర్చున్నాడు.

రాత్రి పన్నెండుకు విజయవాడ. ఈ లోపల అటెండరు చలువ వల్ల కాఫీలు, టీలు, భోజనాలు ఫస్టుక్లాసు స్థాయిలో జరిపించాడు. అప్పుడనిపిం

14-6-91 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

● ప్రొఫెసర్ ఎస్. చంద్రశేఖర్



చింది, డబ్బుంటే ఎప్పుడూ ఇదే విధంగా ప్రయాణించటంలో ఒక లెవెల్, ఒక డిగ్నిటీ, ఒక హుందాతనం లభిస్తుందని. అంతేకాదు కొన్ని విషయాలు మర్చిపోవచ్చు. కొన్ని కొత్త కొత్త అయిడియాస్ వస్తాయి కూడా. జీవితమంతా త్రీ టయిరుకు బానిసగా వుండడంలో వుండే మురికి, కంపు, అడుక్కుండే వాళ్ళు, అడుక్కుంటూ పాడుకుంటూ వచ్చే వాళ్ళు, నేల తుడిచే గుంట వెధవలు, కాఫీ టీ అమ్ముతూ సీట్లన్నీ ఖరాబు చేసే దౌర్జన్య జీవులు, బ్రతుకు భారాన్నిగుర్తు చేసే పుస్తకాలమ్మేవాళ్ళు, గుడ్డివాళ్ళు, కుంటి వాళ్ళు, జేబుదొంగలు, టికెట్టులేని వాళ్ళు, పక్క స్టేషన్‌లో దిగిపోదామని దౌర్జన్యంగా చోటుచేసి కొని పేకాట ఆడేవాళ్ళు, లాంటి మామూలు ఫక్కీకి దూరంగా వుండకపోతే జీవితానికి ఓ క్లాసు రాదని.

విజయవాడ వచ్చేసింది. గోదావరిలో ఎక్కడమంటే అదొక యజ్ఞం. దొరికితే మాత్రం ఉదయం ఎనిమిదింటికే వాల్తేరు చేరవచ్చు. న్యూస్‌పేపరు కొందామని స్టాల్‌వైపు నడిచాడు. అక్కడ ఓ పోర్టరు మాస్టారువైపే. అనుమానాస్పదంగా చూస్తున్నట్లని పించింది.

“చూడయ్యా ఇలారా” అన్నారు మాస్టరు. వాడు అవులిస్తే ప్రేవుల్ని లెక్కపెట్టేవాడు. దగ్గరగా వచ్చాడు. “ఏందీ గోదావరికా” అన్నాడు. మధ్య రాత్రి కావచ్చినా, వాడేం తాగేడో, దగ్గర విపరీతమైన కంపు.

“మీ టికెట్టిలాగివ్వవండి. నేనన్నీ చూసుకుంటాను' అన్నాడు. టికెట్టు వీడికిస్తే, రైలు వచ్చాక వీడు కనపడక పోతే, తిరిగి టికెట్ సంపాదించడం అసంభవం. “'లాభంలేదు, రైలు నేను ఎక్కగలను” అన్నాడేగాని, ఓ పక్క గుండెల్లో పీకుతోంది. “వెధవది కొంచెం డబ్బు ఖర్చు పెట్టితే పొయ్యేదానికి, అనవసరంగా వచ్చిన ఆఫర్ పొగొట్టుకున్నానేమో” నని.

ఓ విధంగా చూస్తే, ఆ టి.సి. కూర్చున్న విధానం, చుట్ట కాల్చడం, తలకు మఫ్లర్ చుట్టుకోవడం, పోర్టర్లతో జోక్సు వేస్తుం డటం, చలికి కోటుకు బదులు పోలీసు స్వెట్టరు వేసుకుని వుండటం, వాళ్లవెకిలి తనానికి మూలం కొంచెం పుచ్చుకున్నట్లు అగుపించడం, ఇవన్నీ మర్యాదకరంగా లేనివిషయాలు. కాని “అర్ధరాత్రికి, ఆర్డినరీ జనానికి రూల్సేమిటి” అని, టీ త్రాగి, పేపరు చదివి, హుందాగా అటూ ఇటూ తిరుగు తుంటే రైలు వచ్చే శబ్దం వినిపించింది.

ఇంతలో వడివడిగా పోర్టరు, మాస్టారుని సమీపించి, “మాస్టరు, మీరు ఆ టి.సి. ఎంబడే ఎళ్ళండి, మీకు సీటు ఇచ్చే వరకూ మిమ్మల్ని ఆయన సీటలో కూర్చో మన్నారండి” అని చెప్పి స్పీడ్‌గా వెళ్లాడు. వాడు తాగి వున్నా గొప్ప యాక్టివ్‌గా వున్నాడు. మాస్టారుకు ఇది విన్న తర్వాత కొండంత ధైర్యం వచ్చింది.

ఒకొక్క టి.సి. వెంట, వి.ఐ.పి. సెక్యూరిటీ లాగ, కనీసం పదిమంది రైల్లోకి ఎక్క వలసిన వాళ్ల తోసుకుంటూ పోతున్నారు. మాస్టారు మాత్రం టి.సి ఎక్కిన బోగీలో ఎక్క అతనిసీట్లో కూర్చున్నాడు. ఛార్టు చూసి ఒక్క ఖాళీ కూడా లేకపోవడంతో, తక్కిన వాళ్ళందరినీ నిర్దాక్షిణ్యంగా దింపేశాడు. కానీ, రైలు కదిలే ముందుగా ఆరుమందిని పోర్టరు రెకమండేషన్‌తో ఎక్కించాడు వాళ్ళందరూ సీట్లు, బెర్తులు లేనందున, నేలపైన షీట్సు వేస్కొని పడుకున్నారు.

చలి విపరీతంగా వుంది. గోదావరి మహా వేగంగా పోతోంది. ఏలూరులో గాని, గూడెంలోగాని, నిడదవోలుల్లో గాని, ఒక్కరూ దిగలేదు. ఉదయం నాలుగింటికి రాజమండ్రి.

మాస్టారు భుజం తట్టి “ఏమండి మీరు ముప్పయి ఆరు లోయరులో పడుకోండి” అన్నాడు టి.సి. బతుకు జీవుడా అనుకుంటూ, కూర్చుని కూర్చుని చెక్కలా తయారయిన శరీరాన్ని కృష్ణారావు మాస్టారు, ముప్పయి ఆరుకు చేర్చాడు.

సంచిని దిండుగా చేసి పడుకోబోతుంటే, టి.సి. వచ్చి, లైటు వేసి, “ మీది ఇవ్వండి” అని చెయ్యి చాపాడు. ఎంత ఇవ్వ వలసిందీ ఎవరూ చెప్పలేదు కాబట్టి, ఇద్దరికీ గౌరవంగా వుండేట్లుగా ఇవ్వవలసినంత ఇచ్చేశాడు. నిద్రకుపక్రమించాడు. లోయరు బెర్తు ఎంతో హాయిగా వుంది. మనసులో టి.సి. కి ధన్యవాదాలు చెప్పకున్నాడు. కప్పకుండేందుకు ఏమైనా తెచ్చుకుంటే బావుండేదని పించింది. ఏదో విధంగా ముదుచుకొని, కిటికీలన్ని వేసి, నిద్రపోయాడు. ఉదయం ఏడున్నరకు టి.సి. వచ్చి 'మాస్టారూ అనకాపల్లి వచ్చేసింది' అన్నాడు. లేవబోతూ చూస్తే తన వంటిపైన మంచి రగ్గు కప్పివుంది.

“ఈ రగ్గు” “అది నాదేలేండి”. “చాలా థాంక్సండీ” అని ఆ రగ్గును తొందరగా మడతవేసి, వెనక్కిచ్చేశాడు. కానీ, “ ఈ వెధవ ను ఎక్కడో చూశానే” అని మాస్టారుకి కాస్త అనుమానం కలిగింది. అయినా అంత మందిలో అడగడం భావ్యం కాదని సాహసించలేదు.

వైజాగ్ వెళ్లిన సాయంకాలం నరసన్నపేట వెళ్ళాడు మాస్టారు. పెళ్లి పెద్దలు అయి దారుమంది వచ్చారు. మరుసటి రోజు వూళ్ళో ఫ్రెండ్స్‌ని కలుస్తామని టౌన్ హాల్ వేపు వెళ్ళాడు. అక్కడ రామలింగ పట్నాయక్ కన పడ్డాడు. పట్నాయక్ ఆర్మీలో ఒక చిన్న ఉద్యోగం నుంచి రిటైర్ అయ్యాడు. ఆయనకు ఒక కొడుకు తర్వాత ముగ్గురు కూతుళ్ళు. “పట్నాయక్ గార్కూమీ కొడుకు ఏమి చేస్తున్నాడు, అమ్మాయిలు ఎలా వున్నారు? స్కూల్లోనూ, కాలేజీలోనూ జులాయిలా తిరుగుతుండేవాడు? “అబ్బే అదేమీ లేదండీ, ఇప్పుడు బావున్నాడు. లేదంటే బి.ఏ. పూర్తి చేయలేకపోయాడు. వాని గేమ్సు, స్పోర్ట్సు వల్లే ఉద్యోగం వచ్చింది. సొంత డబ్బుతో ఈ రెండేళ్లలో మూడు పెళ్లిల్లు చేశాడు. వాడు మాత్రం ఇంకా పెళ్ళి చేసుకో లేదు. ఎక్కువగా విజయవాడలో వుంటాడు”. “ఏం ఉద్యోగమండీ”. మున“ఎస్.ఇ. రైల్వేలో టి.సి.గా వున్నాడండీ!”

పట్నాయక్ వెళ్ళాక, జరిగింది నెమరేశాడు మాస్టారు. “రెండేళ్ళలో మూడు పెళ్ళిళ్ళు”, “స్వంత డబ్బుతో”, “బి.ఎ.” కూడా పాస్ అవ లేదు. తన దగ్గరే నిర్దాక్షిణ్యంగా డబ్బు తీసే స్కున్నాడు. ముప్పయి సంవత్సరాలు నీతులు బోధించి తను మాత్రం ఏం చేశాడు? అవకాశం కొద్దీ మసలుకున్నాడు. 'శిష్యుని చేతిలోనే పరాభవం'. ●